# మీ వెంట.. మేం ఉంటాం..



మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి శనివారం గడ్డిఅన్నారం పోచమ్మ బస్తీలో మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్‌రెడ్డి, తీగల సునరితారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తీగల అజిత్‌రెడ్డి, సునరితారెడ్డి దంపతులను స్థానిక మహిళలు అభిమానంతో హారతి ఇచ్చి స్వాగతం పలికారు. మా ఓటు మీకే అంటూ.. గెలిపించుకుంటామన్నారు. – మలక్‌పేట, నవంబర్ 11

## గోషామహల్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గా జగన్మోహన్‌రావు

అబిడ్స్, నవంబర్ 11 : గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా టీఎస్ టీఎస్ చైర్మన్ పి. జగన్మోహన్‌రావు నియమితులు కాగా ఆయనను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్ కార్యాలయానికి చేరుకున్న పి. జగన్మోహన్‌రావును మాజీ కార్పొరేటర్ ముఖేశ్ సింగ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ముఖేశ్‌సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా జగన్మోహన్‌రావును నియమించడంతో ఆయన పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తారన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించి బీఆర్ఎస్ విజయం సాధించేలా పాటుపడతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటా వివరించి పార్టీ ఘన విజయం సాధించేందుకు ప్రజల మద్దతు కూడగట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పి. వెంకటేశ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారితో మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, నవంబర్ 11: సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నుంచి మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ ఆధ్వర్యంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేశామని చెప్పారు. యువత ఉపాధి కల్పన కోసం బహుళ జాతి కంపెనీలు తీసుకొచ్చి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. రైతు బంధు పథం ద్వారా ఇప్పటివరకు రూ.389 కోట్లు, రైతు బీమా ద్వారా 24కోట్లు, రుణమాఫీ కింద 87 కోట్లు, ఆసరా పెన్షన్లు 576 కోట్లు,కల్యాణలక్ష్మి, కింద 108 కోట్లు, షాదీ ముబారక్ పథకంతో 51 కోట్లు, సీఎం సహాయనిధితో 15 కోట్ల సహాయం చేసినట్లు మంత్రి తెలిపారు. తాను చేసిన అభివృద్ధిని చూసి తనను మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారోజు రామాచారి, గొడుగు శ్రీనివాస్, యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌గుప్తా, ఎం.ఏ.సాజీద్, దేవేందర్, ముచింతల జగన్, జాహెద్, బాలుశ్రీ ఉన్నారు.

## 14న ఎం.ఎల్.నరసింహారావు జయంతి సభ

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 11 : సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో సాహితీవేత్త, భాషా నిలయం అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎల్.నరసింహారావు జయంతి సభ నిర్వహించనున్నారు. 14న మంగళవారం సాయంత్రం భాషానిలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఉంటుందని భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు శనివారం తెలిపారు. ప్రముఖ రచయిత, కవి ప్రాణ్‌రావ్ సాహిత్యానికి చేస్తున్న సేవలకుగాను సాహితీ సేవా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. తరతరాల తెలుగు ప్రముఖులు గ్రంథాన్ని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ఆవిష్కరిస్తారని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని తెలిపారు.

## 17 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం

సైదాబాద్, నవంబర్ 11: సైదాబాద్ సింగరేణి కాలనీలో అక్రమంగా బెల్లం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి మూడు లక్షల రూపాయల విలువైన 17 క్వింటాళ్ల బెల్లంను ఎక్సైజ్, ప్రొహిబిషన్ మలక్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. గోపాల్ శనివారం మలక్‌పేట ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్ ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శర్మ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ అదేశాల మేరకు చంపాపేట సింగిరేణికాలనీ భానునగర్ కాలనీలో లైసెన్స్ లేకుండా అక్రమంగా బెల్లం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి వెళ్లి స్థానికంగా కిరాణాషాపులో సోదాలు జరిపామని తెలిపారు. కిరాణాషాపు యజమాని రమేశ్ తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల తెల్ల బెల్లం, 8 క్వింటాళ్ల పట్టిక బెల్లంను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా కిరాణా షాపులో బెల్లం విక్రయిస్తున్న రమేశ్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బెల్లం విలువ సుమారు మూడు లక్షల రూపాయలు వరకు ఉంటుందని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత 22 కేసుల్లో 9 మందిని అరెస్ట్‌చేసి, 35 మందిరి బైండోవర్ చేశామని తెలిపారు. అదే విధంగా 56 లీటర్ల లిక్కర్, 69 లీటర్ల బీరు, 754 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

## కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ప్రచారం



కాంగ్రెస్‌లో పని చేసే కార్యకర్తలకు న్యాయం జరుగదని ఆ పార్టీ మలక్‌పేట రెబల్ అభ్యర్థి పొల్కం శ్రీనివాస్ మేరు అన్నారు. మలక్‌పేటలో రెబల్ అభ్యర్థిగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. అమూల్యమైన ఓటును తనకు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, వెన్ను పవన్ కుమార్, రఘురాం ఉన్నారు. - చాదర్‌ఘాట్, నవంబర్ 11

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా గుండవరపు వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులుగా అహ్మద్ భాషా, గిరిధర్, కార్యదర్శిగా జీవీ రామారావు, సంయుక్త కార్యదర్శిగా కొండారెడ్డి, కోశాధికారిగా పీఎస్.నాగేశ్, శ్రీధర్, స్పోర్ట్స్ సెక్రటరీగా భవానీ శంకర్, కార్యవర్గ సభ్యులుగా రాజేందర్, ఉమామహేశ్వర్‌రావు, ఎం.మధుసూదన్, కార్తిక్, కె.మధుసూదన్, పవన్‌కుమార్, మనోభావే, భారతి, శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రావు, రామారావు మాట్లాడుతూ.. సంఘ సభ్యుల సమన్వయంతో నిర్ణయాలు తీసుకొని కాలనీ అభివృద్ధికి పాటుపడనున్నట్లు తెలిపారు. - మలక్‌పేట, నవంబర్ 11

# ప్రత్యేక నిధులను కేటాయించారు..



మలక్‌పేటలో కాలనీల్లో వేసిన కొత్త రోడ్లు (ఫైల్)

సైదాబాద్, నవంబర్ 11 : తెలంగాణ ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించింది. మలక్‌పేట నియోజకవర్గంలో పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్లను సుందరంగా మార్చారు. నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్లలన్నింటినీ చక్కగా ముస్తాబు చేశారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా గుంతల రోడ్లను బాగుచేసి వాటి స్థానంలో కొత్త రోడ్లువేస్తున్నారు. మలక్‌పేట పరిధిలో రూ.50కోట్ల వ్యయంతో బీటీ, వీడీసీసీ రోడ్లకు కొత్త అందాలు తెచ్చారు. ఇప్పటికే డివిజన్ల పరిధిలోని నిత్యం రద్దీగా ఉండే రోడ్లను సీఆర్ఎఫ్ఈ రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్ల అద్దంలగా తయారుచేసి వాహనదారులు, ప్రజలకు కష్టాలను తొలగించారు.

### కాలనీల్లో రోడ్లకు కొత్త అందాలు..

ఆరు డివిజన్లలో పలు కాలనీల్లో కొత్త రోడ్లు వేస్తున్నారు. సీసీ, బీటీ రోడ్లను నూతనంగా వేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. కాలనీ అంతర్గత రోడ్లతోపాటు ప్రధాన రోడ్లను సుందరంగా తీర్చిదిద్దే పనుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన నిధులతో కేటాయించిన రోడ్ల పనులన్ని శరవేగంగా కొనసాగుతున్నాయి. పనులను సకాలంలో పూర్తి చేయటానికి జీహెచ్ఎంసీ అధికారులు రోడ్ల వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. కాలనీల్లో మరమ్మతులు చేసే రోడ్లను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి వేసి ప్రజల కష్టాలను తీర్చుతున్నారు. ఇన్ని రోజుల బాధలన్ని తొలుగడంతో నియోజవర్గ ప్రజలు, వాహనదారులు సంతోషంగా ఉన్నారు.


